## క్లుప్తంగా

### విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి


ర్యాలీలో వ్యవసాయాధికారి బుజ్జిబాయి

పెద్దారవీడు: ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని వ్యవసాయాధికారి కె.బుజ్జి బాయి అన్నారు. మండలంలో తోకపల్లి, మద్దలకట్ట, సానికవరం, బద్వీడుచెర్లోపల్లి గ్రామాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆధార్ కార్డు తరహాలో 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య అందించనున్నట్లు తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలు సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడం ముఖ్య ఉద్దేశమన్నారు. గుర్తింపు కార్డుతో వివిధ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు

### దేకనకొండను సందర్శించిన వైద్యులు


పాఠశాలను సందర్శించిన ఫ్లోరోసిస్ వైద్యులు

కురిచేడు: మండలంలోని దేకనకొండ గ్రామాన్ని ఫ్లోరోసిస్ టీం మంగళవారం సందర్శించింది. ఫ్లోరోసిస్ ఆఫీసర్ డాక్టర్ వి.అనీల్, సూపర్‌వైజరు అంజిరెడ్డిలు గ్రామంలో గృహ సందర్శన చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉచితంగా వాకర్స్, స్టిక్స్ పొందిన వారి ఇళ్లకు వెళ్లి పూర్వాపరాలు సేకరించారు. ప్రజలు ఏ నీరు తాగుతున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌సీడీసీడీ హెల్త్ ప్రోగ్రాంలో ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎస్సీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. పర్సనల్ హైజీనీ గురించి, వారు తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలియజేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి పి.ప్రవీణ్, డాక్టర్ రవితేజ, సీహెచ్ఓ కృపమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ దీనా, ఏఎన్ఎం నాగమణి, ఆశా కార్యకర్త సుగుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయభారతి పాల్గొన్నారు.

# మహాశివరాత్రి మహోత్సవాలు ప్రారంభం


జ్ఞానప్రసూనాంబ, కాళహస్తీశ్వరస్వామి మూలవిరాట్


అంకురార్పణ కార్యక్రమానికి హాజరైన భక్తులు

కురిచేడు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్థానిక శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి, పడమర గంగవరం చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శివరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేదపండితుల వేదమంత్రోచ్చరణల మధ్య అంకురార్పణ చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తిశూలేశ్వరుడు గ్రామోత్సవంతో మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గణపతి పూజ, పుణ్యాహ వచనం, ఆలయ శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం వేకువ జామున 3 గంటల నుంచి మహాన్యాస పూర్వక పంచామృతాలతో ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం నంది వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 10 గంటల నుంచి స్వామి వారికి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక పంచామృతాలతో ఏకాదశి రుద్రాభిషేకం జరుగుతుంది. అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి ఒంటి గంటకు స్వామి, అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం జరుగుతాయి. గురువారం ఉదయం త్రిశూలేశ్వరుడు గ్రామోత్సవం, సాయంత్రం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం ,శుక్రవారం త్రిశూలేశ్వరుని గ్రామోత్సవం, చండీ హోమం, శనివారం సాయంత్రం పవళింపు సేవతో మహోత్సవ కార్యక్రమాలు పూర్తవుతాయని ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు తెలిపారు. పూజారులు నారాయణం వెంకటేశ్వర్లు, వీఆర్వో కలవకొలను వెంకట నాగ రాజు, కొత్తవెంకట అయ్యప్పశెట్టి, కట్టమూరి నాగేశ్వరరావు, మేదం శివ, వెంకీ పాల్గొన్నారు.


ముస్తాబైన శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం

## మహాశివరాత్రి నేపథ్యంలో ధార్మిక సంస్థల దాతృత్వం


రెడ్ల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం

- శ్రీశైలం వెళ్లే భక్తులు, యాత్రికులకు అన్నదానం
- మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించిన సేవా సంస్థలు


కాపు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదానం

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే యాత్రికులు, శివ భక్తులకు మండల పరిధిలోని శ్రీశైలం రహదారిలో పలు ధార్మిక సంస్థలు అన్నదానంతో పాటు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేసి తమ తమ సేవా కార్యక్రమాలు ముమ్మరం చేశాయి. యాత్రికులకు భోజన వసతితో పాటు అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. మండల రెడ్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భారీ అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమంలో యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు, ఎస్సై మహేష్‌తో పాటు అమిరెడ్డి రామిరెడ్డి, బట్టు సుధాకరరెడ్డి, గంటా రమణారెడ్డి, బట్టు రమణారెడ్డి, గుంటూరు గాలిరెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, యక్కంటి మల్లారెడ్డి, లాలూనాయక్ పాల్గొన్నారు. శ్రీకృష్ణ దేవరాయల కాపు, బలిజ, ఒంటరి తెగల సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానంలో ఎస్సై మహేష్, పులి ప్రసాద్, యామా దాసయ్య, కేతి మురళి, గుర్రాల ప్రసాద్, కమ్మ వెంకటేశ్వర్లు (పండు), రాంశెట్టి కృష్ణ, దర్శి నారాయణ, సూరె శివ, రేళ్ల చిన్న కాశీరాములు, వీరిశెట్టి ఫణీంద్ర పాల్గొన్నారు. మండల పరిధిలోని పెద్ద బొమ్మలాపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీశైలం రోడ్డులో అన్నదానం చేశారు. మార్కాపురానికి చెందిన శివదీక్ష సంఘం సేవా భారత్ ఆధ్వర్యంలో పలువురు యువకులు అన్నదానం చేపట్టారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

## అంగన్‌వాడీల్లో చిన్నారుల సంఖ్య పెరగాలి


జ్ఞాన జ్యోతి ముగింపు సమావేశంలో ఎంఈఓ రమాదేవి

దర్శి (కురిచేడు): మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి చిన్నారుల సంఖ్యను పెంచాలని ఎంఈఓ రమాదేవి ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ సహకారంతో అంగన్‌వాడీలకు నిర్వహించిన జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాలు ముగింపునకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సపోర్టింగ్ ఆంధ్ర లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమంలో అంతర్భాగంగా నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి అంగన్‌వాడీల 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు శిక్షణ శిబిరాలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. రెండు దశల్లో నిర్వహించిన కోర్సు శిక్షణ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. కోర్సు డైరెక్టర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాదర్‌బాషా, పర్యవేక్షణ అధికారిగా ఎంఈఓ–2 రమాదేవి, డీఆర్పీలుగా అంగన్‌వాడీ సూపర్‌వైజరు కె.అనూరాధ, బి.నాగార్జున, విక్రమ్‌లు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న జ్ఞానాన్ని పిల్లలకు తెలియజేయాలని ఆమె సూచించారు.

# భక్తులతో గౌరవంగా మెలగాలి


పార్కింగ్‌ను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైల పుణ్యక్షేత్రానికి తరలి వచ్చే భక్తులతో గౌరవంగా మెలగాలని యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు సిబ్బందికి సూచించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ట్రాఫిక్ తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియమ నిష్టలతో భక్తిశ్రద్ధలతో శివమాలలు ధరించి దైవ దర్శనార్థం వచ్చే యాత్రికులతో కఠినంగా ప్రవర్తించటం సరికాదన్నారు. వారి పట్ల గౌరవంగా మెలగాలని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్వదినం పూర్తయి యాత్రికుల రద్దీ తగ్గేంత వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. లక్షలాది మంది భక్తులు శ్రీశైల పుణ్యక్షేత్రానికి వస్తున్నందున జేబుదొంగలు, చైన్ స్నాచర్లు సంచరించే ప్రమాదం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. దీంతో పాటు విధుల్లో వ్యవహరించాల్సిన తీరుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేపట్టినట్లు ఆయన తెలిపారు. శ్రీశైలం వచ్చి, వెళ్లే వాహనాల సంఖ్య అధికంగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, దీనితో పాటు ఘాట్ రోడ్లలో ప్రమాదాలను నివారించే లక్ష్యంతో ఘాట్ రోడ్లలోకి ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణాన్ని నిషేధిస్తున్నట్లు ఆయన తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణాన్ని రద్దు చేసుకోవాలని సూచించారు. మల్లికార్జున నగర్‌లో పార్కింగ్ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

# కష్టపడి చదివితే మంచి ఫలితాలు


ఉపాధ్యాయులతో విద్యార్థులు

దొనకొండ: విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు పొంది ఉన్నత శిఖరాలకు ఎదిగి సమాజానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు 10వ తరగతి మొట్ట మొదటి మెట్టని గుర్తు చేశారు. జీవితంలో మంచి పేరు తెచ్చి పెట్టాలంటే ఈ మెట్టు సోపానం అని గుర్తు చేశారు. మార్చి 17వ తేదీ నుంచి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయని, 160 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని, సమయం చాలా తక్కువ ఉందని, సమయానికి విలువ ఇచ్చి శ్రద్ధతో చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి సహా పంక్తి భోజనం చేశారు.

# దొనకొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి


మాట్లాడుతున్న రంగారావు

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలో 2014లో ప్రభుత్వం ప్రకటించిన పారిశ్రామిక కారిడార్ బోర్డుకే పరిమితమైందని, 2025–26 రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు ప్రారంభించి పరిశ్రమలు స్థాపించాలని సీపీఎం జిల్లా నాయకులు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం దొనకొండ పారిశ్రామిక కారిడార్ ప్రాంతాన్ని జిల్లా, మండల నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రంగారావు విలేకరులతో మాట్లాడుతూ దొనకొండ ప్రాంతం రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిందని, ఇక్కడి ప్రజలకు పనులు దొరక్క నిత్యం వలసలు పోతున్నారని, గతంలో శ్రీకృష్ణ కమిటీ 25 వేల ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములు ఉన్నాయని, రాజధాని ఇక్కడ ఏర్పాటు చేయాలని సూచించిందని గుర్తు చేశారు. రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయడంతో నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో మొదటి అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దొనకొండ ప్రాంతంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తామని ప్రకటించి 2018లో 2500 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించారన్నారు. 2019లో 48 ఎకరాల్లో చిన్నా, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుకు కేటాయించారన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేయకుండా కాలయాపనకే పరిమితమయ్యారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదని, ఇప్పుడు చిల్లచెట్లతో ప్రభుత్వ భూమి మూసుకు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దొనకొండ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్య నిర్మూలించాలన్నారు. గతంలో విదేశీయులు ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పారేగానీ ముందుకు రాలేదన్నారు. ఈ ఏడాది కారిడార్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని అంజయ్య డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఎం జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. కె.పిచ్చయ్య, నాగేశ్వరరావు, చిన్న నరసింహులు, ప్రభాకర్, కాశయ్య, కిరణ్‌కుమార్, నరసింహారావు పాల్గొన్నారు.

## సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి


సర్వేను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ జనార్దన్

ముండ్లమూరు (కురిచేడు): కలెక్టర్ ఆదేశాల మేరకు పీ–4 సర్వేను ఎంపీడీఓ జనార్ధన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని శంకరాపురం, పసుపుగల్లు, పెద్ద ఉల్లగల్లు, పులిపాడు గ్రామ పంచాయతీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి ఇంటిని సందర్శించి తప్పులు లేకుండా సర్వే చేయాలన్నారు. సర్వే చేయడంలో నిర్లక్ష్యం వహించిన సచివాలయం సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ–పంట నమోదు చేసుకోవాలి


రైతులకు వివరాలు తెలియజేస్తున్న ఏఓ ఫరూక్

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని రబీ సాగు చేసిన రైతులు తమ పంటలను మార్చి 3వ తేదీలోపు ఈ–పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ తెలిపారు. మండలంలోని సింగన్నపాలెంలో మంగళవారం పంట పొలాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి సామాజిక తనిఖీ కోసం రబీ పంట నమోదు జాబితాను ప్రదర్శిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టిన రైతు విశిష్ట సంఖ్యలో అందరూ పాల్గొని నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ విస్తరణాధికారి స్వాతి, రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ఇమ్మానియేల్ రాజు

తాళ్లూరు: భూముల వివరాలు, పంటల వివరాలు నమోదు చేసే ప్రక్రియలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల పాత్ర ఎంతో కీలకమైందని, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, తహసీల్దార్ పి.ఇమ్మానియేల్‌రాజు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఏఏలతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీ, ఈ–పంట నమోదు రికార్డుల్లో తేడాలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డీటీ ప్రశాంత్, సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.